క్లుప్తంగా

19న సర్వసభ్య సమావేశం

బంట్వారం: కోట్‌పల్లి మండల సర్వసభ్య సమావేశం ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు ఎంపీపీ శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సమీక్షకు ఎంపీటీసీ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఎంపీపీ కోరారు.

నూతన ఎస్‌ఐగా అన్వేష్ కుమార్


అన్వేష్ కుమార్

కుల్కచర్ల: నూతన ఎస్‌ఐగా అన్వేష్ కుమార్‌ను నియమితులయ్యారు. గురువారం జిల్లాలో పలువురు ఎస్‌ఐలను బదిలీ చేశారు. ఇందులో భాగంగా కుల్కచర్లలో ఎస్‌ఐగా పచేస్తున్న శ్రీశైలంను బంట్వారంకు బదిలీ చేయగా.. జిల్లా కేంద్రంలో పనిచేస్తున్న అన్వేష్‌ను ఇక్కడికి బదిలీ చేశారు. కాగా అన్వేష్ కుమార్ గతంలో ఇక్కడ ట్రైనీ ఎస్‌ఐగా పనిచేశారు.

సేవలతోనే గుర్తింపు


సర్పంచ్ బాలయ్య దంపతులను సన్మానిస్తున్న నేతలు

కుల్కచర్ల: ప్రజలకు, ఊరికి చేసిన సేవలే ప్రజాప్రతినిధులకు గుర్తింపు తెస్తుందని ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డి అన్నారు. కుల్కచర్ల మండలం సాల్వీడు గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ బాలయ్య దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామ అభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమన్నారు. కార్యక్రమంలో ఎంపీఓ ఖరీం, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆంజనేయులు, పరిగి బ్లాక్ బి అధ్యక్షుడు భరత్ కుమార్, మాజీ ఎంపీపీ అంజిలయ్య గౌడ్, నాయకులు జోగు వెంకటయ్య, చిన్న పులింగ వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంతి గృహాన్ని వినియోగించాలి


నిరుపయోగంగా ఉన్న విశ్రాంతి గృహం

ధారూరు: అధికారుల విశ్రాంతి గృహం నేడు నిరుపయోగంగా మారింది. మార్చి 2023 వరకు ఇందులో మండల వ్యవసాయ కార్యాలయం కొనసాగింది. దానిని ధారూరు రైతు వేదికలోకి మార్చడంతో ఇది వృథాగా ఉండిపోయింది. రూ.లక్షలు వెచ్చించి, నిర్మించిన భవనాన్ని వినియోగంలోకి తెచ్చేలా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు.

క్రీడలపై ఆసక్తితోనే కొలువు సాధించా..


నియామకపత్రంతో అమృత

పెద్దేముల్: క్రీడలపై ఉన్న ఆసక్తితోనే ఫిజికల్ డైరెక్టర్‌గా కొలువు సాధించానని అమృత తెలిపారు. మండల పరిధి గాజీపూర్ గ్రామానికి చెందిన బుద్ధారం అమృత గురుకుల ఫలితాల్లో ఫిజికల్ డైరెక్టర్‌గా ఉద్యోగం సాధించారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్‌లోని ఎల్‌బీ స్టేడియంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకున్నారు. అమృత ప్రభుత్వ ఉద్యోగం సాధించడంతో ఆమె తల్లిదండ్రులు, గ్రామస్తులు హర్షం వ్యక్తంచేశారు.

అప్రమత్తంగా ఉండాలి


ఠాణాలో రికార్డులను పరిశీలిస్తున్న సీఐ శ్రీనివాస్

పూడూరు: విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని సీఐ శ్రీనివాస్ సిబ్బందికి సూచించారు. గురువారం మండల పరిధి చన్గోముల్ పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. ఠాణాకు వచ్చే ఫిర్యాదు దారులతో మర్యాదగా ఉండాలని చెప్పారు. గ్రామాల్లో నిత్యం గస్తీ నిర్వహిస్తూ, నేరాల అదుపునకు కృషి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఠాణాలోని పలు రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ మధుసూదన్‌రెడ్డి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కొడంగల్‌లో.. మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి


పరిగి: సేవాలాల్ జయంతి కార్యక్రమంలో.. మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి తదితరులు


బంట్వారం: కోట్‌పల్లిలో సేవాలాల్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న బంజారా నాయకులు తదితరులు

గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్

- బంజారాల జీవితాల్లో వెలుగులు నింపిన మహరాజ్
- ఆయన అడుగు జాడల్లో ప్రతి ఒక్కరూ నడవాలి
- సంత్ సేవాలాల్ జయంతిలో నేతలు

తాండూరు టౌన్: బంజారాల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు సద్గురు సంత్ సేవాలాల్ మహరాజ్ అని ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి అన్నారు. సేవాలాల్ జయంతి సందర్భంగా చించోళి రోడ్డులోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ అని, సంచార జీవనం గడుపుతున్న వారికి ఆయన మార్గదర్శకుడిగా నిలిచాడని చెప్పారు. స్థిర నివాసాలు ఏర్పర్చుకుని, వ్యవసాయం చేసే విధంగా అండగా నిలిచారని కొనియాడారు. ఆయన ఆశయాలు అందరికీ ఆదర్శనీయమని పేర్కొన్నారు. గిరిజనుల అభ్యున్నతికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, నియోజకవర్గంలో బంజారా భవన్ నిర్మాణానికి సహాయ సహకారాలుంటాయన్నారు. అనంతరం బంజారాలు ఎమ్మెల్యేను సత్కరించారు. కార్యక్రమంలో బంజారా నాయకులు ధారాసింగ్, వాసుపవార్, మున్సిపల్ చైర్ పర్సన్ తాటికొండ స్వప్న, నీరజాబాల్ రెడ్డి, గాజుల మాధవి, నాయకులు డాక్టర్ సంపత్ కుమార్, మురళీకృష్ణ గౌడ్, రవిగౌడ్, హబీబ్ లాలా, ప్రభాకర్ గౌడ్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

సేవాలాల్ ఆశయసాధనకు కృషి

పరిగి: సేవాలాల్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్ రెడ్డి అన్నారు. పట్టణ కేంద్రంలో సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ అని, వారిని ఒక్క తాటిపైకి తీసుకువచ్చిన మహనీయుడు అని కొనియాడారు. గిరిజనులు సేవాలాల్ జయంతిని ఉత్సవాలుగా నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. ఇందులో మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్, ఎంపీపీ అరవింద్‌రావు, పీఏసీఎస్ వైస్‌చైర్మన్ భాస్కర్, నాయకులు ప్రవీణ్‌రెడ్డి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.


కుల్కచర్ల: సేవాలాల్ జయంతి ర్యాలీలో గిరిజనులు

బంట్వారంలో..

బంట్వారం: సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా పలువురు నాయకులు కోట్‌పల్లి మండల కేంద్రంలోని మహరాజ్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇందులో కాంగ్రెస్ పార్టీ కోట్‌పల్లి మండల అధ్యక్షుడు నర్సింగ్ నాయక్, మాజీ సర్పంచ్ జ్ఞానేశ్వర్, నాయకులు రాము నాయక్, సమ్మయ్య, సంగయ్య ఉన్నారు.

సేవాలాల్ ఆలయాల్లో హోమం

మోమిన్‌పేట: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవలాల్ జయంతి మండలంలో ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా సేవలాల్ ఆలయాల వద్ద హోమం నిర్వహించారు. మహిళలు ఆట పాటలు పాడుతూ నైవేద్యం సమర్పించారు.

బొంరాస్‌పేటలో..

బొంరాస్‌పేట: బంజారాల హక్కుల కోసం పోరాడిన మహనీయుడు సంత్ సేవాలాల్ మహరాజ్ అని మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి అన్నారు. సేవాలాల్ జయంతి సందర్భంగా ఆయన మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గిరిజన తండాల్లోని పాఠశాలల్లో ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువజన సంఘాల ఆధ్వర్యంలో నివాళులర్పించారు. మండల కేంద్రంలోని భూలక్ష్మి చౌరస్తాలో బంజారాలు నృత్యం చేస్తూ.. ఆడిపాడారు. ఈ సందర్భంగా టీవీవీ రాష్ట్ర కార్యదర్శి రవీందర్‌గౌడ్ మాట్లాడుతూ.. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ అని కొనియాడారు.

కుల్కచర్లలో..

కుల్కచర్ల: సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధి గ్రామాల్లో ఘనంగా జరిపారు. కుల్కచర్ల మండల కేంద్రంలో విద్యార్థులు, యువకులు, గిరిజన మహిళలతో భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక ఫంక్షన్‌హాల్‌లో బోగ్ బండార్ పూజలు జరిపి, సేవాలాల్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఇందులో ఎంపీపీ సత్యహరిశ్చంద్ర, జెడ్పీటీసీ రాందాస్ నాయక్, బీజేపీ గిరిజన మోర్చా జిల్లా అధ్యక్షుడు గోవింద్ నాయక్, కాంగ్రెస్ పార్టీ ఎస్టీసెల్ జిల్లా అధ్యక్షుడు శివరాం నాయక్, కేఎస్‌ఆర్ ట్రస్ట్ చైర్మన్ శరత్‌కుమార్ రెడ్డి, కాంగ్రెస్ కుల్కచర్ల మండల ప్రధాన కార్యదర్శి గోపాల్ నాయక్, మండల మాజీ సర్పంచుల సంఘం అధ్యక్షుడు శంకర్ నాయక్, మాజీ సర్పంచ్ జానకిరాం, నాయకులు హరిలాల్, రవి, గాంగ్యా, రాజేందర్, విఠల్, జయరాం, రమేష్, జాను, లాలు పాల్గొన్నారు.

మర్పల్లిలో..

మర్పల్లి: సంతు సేవాలాల్ మహరాజ్ గిరిజనులకు ఆరాధ్యదైవమని మాజీ సర్పంచ్ పాండునాయక్ అన్నారు. మండల పరిధి మర్పల్లి తండా, పట్లూర్ తండా, గుర్రంగట్టు తండా, నర్సాపూర్ చిన్న, పెద్ద తండా, బూచన్‌పల్లి, శాపూర్, దామస్తాపూర్ గిరిజన తండాల్లో మహరాజ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇందులో గోపాల్, రవి నాయక్, రాంచందర్, ధరమ్‌సింగ్, రాజునాయక్, మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా.. చెవేళ్ల మాజీ ఎంపీ కొండవిశ్వేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు కేవీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 7 గిరజన తండాల్లో స్వీట్లు పంపిణీ చేసినట్లు ట్రస్ట్ మండల కోఆర్డీనేటర్ శేఖర్ తెలిపారు.

సంత్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకంలో చేర్చండి

తాండూరు టౌన్: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జీవిత చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్చాలని తాండూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్ కోరారు. మహరాజ్ జయంతి సందర్భంగా చించోళి రోడ్డులో ఉన్న సేవలాల్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం నాయక్ మాట్లాడారు. మనుషులంతా సమానమేనంటూ.. జాతి వివక్షపై ఉద్యమించిన మహనీయుడు సేవాలాల్ అని కొనియాడారు. ఆయన విగ్రహాన్ని ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరతామన్నారు. జయంతి రోజును సెలవు దినంగా ప్రకటించాలని కోరారు. ఇందులో భూకైలాస్ ఆలయ చైర్మన్ వాసుపవార్, కౌన్సిలర్ భీంసింగ్, వెంకట్రాం నాయక్ ఉన్నారు.


సేవాలాల్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న విఠల్‌నాయక్ తదితరులు

సద్గురు అడుగు జాడల్లో నడవాలి

కొడంగల్: ప్రతి ఒక్కరూ సద్గురు సేవాలాల్ అడుగు జాడల్లో నడవాలని మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి అన్నారు. సేవాలాల్ జయంతి సందర్భంగా కొడంగల్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమానికి కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ మండలాల నుంచి అధిక సంఖ్యలో గిరిజనులు తరలివచ్చారు. ఈ సందర్భంగా నరేందర్‌రెడ్డి మాట్లాడారు. తమ హయాంలో తండాలను జీపీలుగా గుర్తించామన్నారు. కొడంగల్‌లో గిరిజన భవన్ నిర్మాణం కోసం స్థలం కేటాయించినట్లు తెలిపారు. ఇందులో మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌రావ్ యాదవ్ పాల్గొన్నారు.

అనంతగిరిలో..

అనంతగిరి: సంత్ సేవాలాల్ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడవాలని గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనునాయక్ అన్నారు. మహరాజ జయంతి సందర్భంగా వికారాబాద్‌లోని ఎస్టీ బాలికల వసతి గృహంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. నాయకులు వెంకట్‌రాములు, మైపాల్, రాందాసు ఉన్నారు.

ధారూరులో..

ధారూరు: మండల పరిధి డీకేతండా, మైలారం ముందలి తండాల్లో సేవాలాల్ జయంతిని నిర్వహించారు. మైలారం ముందలితండాలో నిర్వహించిన జయంతిలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్ పాల్గొని, సేవాలాల్ చిత్రపటానికి నివాలి అర్పించారు.

గిరిజనులకు కాంగ్రెస్‌తోనే గుర్తింపు

తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

బషీరాబాద్: కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజనులకు గుర్తింపు లభిస్తుందని, వారి అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తామని తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. సేవాలాల్ మహరాజ్ జయంతి సందర్భంగా బషీరాబాద్ మండల కేంద్రంలో ఆయన విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. సేవాలాల్ జయంతిని తమ ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించిందన్నారు. ఎన్నో ఏళ్లగా గిరిజనులు చేస్తున్న డిమాండ్‌ను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేర్చారని తెలిపారు. గిరిజన భవన నిర్మాణానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ కరుణ, జెడ్పీటీసీలు శ్రీనివాస్‌రెడ్డి, తాండూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్‌నాయక్, గిరిజన నాయకులు రామునాయక్, పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్ ప్రసాద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్‌పర్సన్ శాంతబాయి, వెంకటేశ్ మహరాజ్, రోహిత్ మహరాజ్, మాజీ సర్పంచ్ ప్రియాంక, నరేష్ చౌహన్, బన్సీలాల్ తదితరులు పాల్గొన్నారు.


సేవాలాల్ విగ్రహాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బీఎమ్మార్


మర్పల్లిలో..


మోమిన్‌పేట: సేవాలాల్ ఆలయం వద్ద పూజలు


ధారూరు: మైలారం ముందలితండాలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్


అనంతగిరి: నివాళి అర్పిస్తున్న నాయకులు

బదిలీలు సాధారణం

పరిగి: ఉద్యోగులకు బదిలీలు సాధారణమని, ఎక్కడ పనిచేసినా.. వారు చేసిన సేవలే ప్రజల్లో గుర్తింపు తెస్తుందని మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్‌కుమార్ అన్నారు. బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసన్‌కు, బదిలీపై వచ్చిన కమిషనర్ వెంకటేశ్‌లకు పాలకవర్గం ఘనంగా సన్మానించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉత్తమ సేవలు అందించిన వారిని ప్రజలు ఎప్పుడూ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. కావున విధినిర్వహణలో పక్కాగా ఉండాలని సూచించారు. మున్సిపల్ కౌన్సిలర్లు ఎదిరె కృష్ణ, వెంకటేశ్, నాగేశ్వర్, ఎర్రగడ్డపల్లి కృష్ణ, తాహెర్ అలీ, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

రథ సప్తమి నేడు

కొడంగల్: పట్టణంలోని బాలాజీనగర్‌లో వెలసిన పద్మావతీ సమేత మహాలక్ష్మి వేంకటేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం రథ సప్తమి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు ఉభయ దేవేరుల సమేత మలయప్ప స్వామివారు ఏడు వాహనాలపై భక్తులకు దర్శనమిస్తారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేస్తారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకోవాలని ధర్మకర్తలు కోరారు.

డీపీఆర్‌ఓ బదిలీ

అనంతగిరి: వికారాబాద్ డీపీఆర్‌ఓ ఆరీఫుద్దీన్‌ను జోగులాంబ గద్వాల జిల్లాకు ప్రభుత్వం బదిలీ చేసింది. ఏడు సంవత్సరాలుగా ఆయన ఇక్కడ బాధ్యతలు నిర్వర్తించారు. ఆయన స్థానంలో చెన్నమ్మను నియమించారు.

30 రోజుల్లో నివేదిక ఇవ్వాలి

అనంతగిరి: ఈ నెల 2న వికారాబాద్‌లో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ సమావేశంలో జరిగిన ఘటన విషయంలో తనకు న్యాయం జరగలేదని ఆ పార్టీ సీనియర్ నాయకుడు భూమొల్ల కృష్ణయ్య ఆవేదన వ్యక్తంచేశారు. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఎస్సీ కమీషన్‌ను సంప్రదించినట్లు ఆయన పేర్కొన్నారు. కాగా స్పందించిన కమీషన్.. ఈ ఘటన విషయమై 30 రోజుల్లోగా నివేదిక ఇవ్వాలని ఎస్పీని ఆదేశించింది.

ఘనంగా శివుడి శోభాయాత్ర


శివుడి ప్రతిమను ఊరేగిస్తున్న భక్తులు

కుల్కచర్ల: మండల కేంద్రంలో మల్లికార్జున సేవా సమితి ఆధ్వర్యంలో శివుడి ప్రతిమతో శోభాయాత్రను నిర్వహించారు. ఈ సందర్భంగా భజనలతో ర్యాలీగా మైలమ్మచెరువు సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయం వరకు ఊరేగించారు.

స్వచ్ఛంద సంస్థ సేవలు అభినందనీయం


టాయిలెట్ల నిర్మాణం కోసం భూమిపూజ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

పూడూరు: గ్రామాల్లో స్వచ్ఛంద సంస్థల సేవలు అభినందనీయమని మాజీ సర్పంచ్ సంధ్య అన్నారు. గురువారం మండల పరిధి సోమన్‌గుర్తి గ్రామంలో హైదరాబాద్ గచ్చిబౌలిలోని సైబేజ్ సాఫ్ట్‌వేర్ కంపనీ ప్రతినిధులు గ్రామాన్ని దత్తత తీసుకుని, పలు అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ఆశా కార్యక్రమం ద్వారా రూ.10 లక్షల వ్యయంతో పంచాయతీ కార్యాలయం నుంచి ప్రభుత్వ పాఠశాల వరకు సీసీరోడ్డు పనులు చేపట్టారని మాజీ సర్పంచ్ తెలిపారు. రోడ్డుతో పాటు బడిలో రూ.4 లక్షలతో మరుగుదొడ్ల నిర్మాణం కోసం భూమిపూజ చేశారన్నారు. ఇందులో సంస్థ మేనేజర్ ప్రశాంత్ మహాముని, సీనియర్ ఎగ్జిక్యూటివ్ సురేష్, ఎంపీటీసీ సిరిదేవిక, శివారెడ్డి, పాఠశాల చైర్మన్ వెంకటేశ్, నాయకులు సీతారాంరెడ్డి తదితరులు ఉన్నారు.

కార్మికుల సేవలు వెలకట్టలేనివి


కుల్కచర్ల: జీపీ కార్మికులను సన్మానిస్తున్న అధికారులు తదితరులు


కొడంగల్: కార్మికులకు సన్మానం చేస్తున్న ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ తదితరులు

- వారితోనే గ్రామాల్లో స్వచ్ఛత
- మాజీ పాలకవర్గ సభ్యుల సత్కారంలో నేతలు

కుల్కచర్ల: గ్రామాన్ని స్వచ్ఛతగా ఉంచడంలో కార్మికుల పాత్ర వెలకట్టలేనిదని తహసీల్దార్ మురళీధర్ అన్నారు. పారిశుద్ధ్య వారోత్సవాల ముగింపు నేపథ్యంలో గురువారం మండల కేంద్రంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికుల సేవలను అభినందిస్తూ వారిని సన్మానించారు. అనంతరం మాట్లాడారు. తమ ఆరోగ్యాన్ని లెక్కచేయకుండా.. గ్రామస్తుల ఆరోగ్య సంరక్షణకు నిర్విరామంగా కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్మికులకు తాము అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆనందం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

కొడంగల్‌లో..

కొడంగల్: మండల పరిధి రుద్రారం గ్రామంలో ఎంపీపీ ముద్దప్ప దేశ్‌ముఖ్ ఆధ్వర్యంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, కాంగ్రెస్ నాయకులు పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. కార్మికులతోనే గ్రామాలు పరిశుభ్రంగా ఉంటున్నాయని, వారికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచులు చిట్లపల్లి వెంకట్‌రెడ్డి, రుద్రారం సాయిలు, కాంగ్రెస్ మండల కమిటీ అధ్యక్షుడు నందారం ప్రశాంత్, పీసీసీ సభ్యుడు మహ్మద్ యూసూఫ్, కాంగ్రెస్ నాయకులు వెంకటయ్య గౌడ్, ప్రహ్లాద్‌రెడ్డి, గోడల రాంరెడ్డి, అంబయ్య గౌడ్, ఆనంద్ రెడ్డి, ఖాసీం తదితరులు పాల్గొన్నారు.

ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన

ధారూరు: మండల పరిధి తరిగోపుల గ్రామంలో అంజనేయస్వామి ధ్వజస్తంభ, వినాయక విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా జరిగింది. మూడు రోజుల పాటు జరిగిన ఉత్సవాల్లో ముగింపు రోజైన గురువారం.. ఆవాహిత దేవతా పూజ, పీఠ దేవత, హోమం, యంత్ర ప్రతిష్ఠ, పూర్ణాహుతి, మంగళ హారతి తదితర కార్యక్రమాలను నిర్వహించారు. వేద పండితులు కృష్ణ పంతులు ఆధ్వర్యంలో వేడుకలు ఘనంగా జరిగాయి. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు.

‘కార్పొరేట్ల’కు కొమ్ముకాస్తున్న కేంద్రం

- సమస్యల పరిష్కారానికి నేడు ‘గ్రామీణ భారత్ బంద్’
- విజయవంతం చేయాలని కార్మిక సంఘాల పిలుపు


సమ్మె పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కార్మికులు

తాండూరు టౌన్: కార్పొరేట్ సంస్థలకు కేంద్రం కొమ్ముకాస్తూ.. కార్మికులకు నిర్లక్ష్యం చేస్తుందని కార్మిక సంఘం నాయకులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం తాండూరు పట్టణ మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేసి, పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుండా.. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న మొండి వైఖరికి నిరసనగా నేడు ‘గ్రామీణ భారత్ బంద్’ పేరుతో దేశవ్యాప్తంగా సమ్మె చేపట్టనున్నామని తెలిపారు. కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ కార్మికులను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని కోరారు. అదే విధంగా ప్రభుత్వ రంగ సంస్థల వాటాల అమ్మకాలను నిలిపివేయాలని, ఉపాధిహామీని పట్టణానికి విస్తరింపచేసి రూ.600 కూలీ చెల్లించాలన్నారు. అసంఘటిత రంగ కార్మికులకు సామాజిక భద్రతా పథకాలను ప్రవేశ పెట్టాలని, కనీస పింఛన్ రూ.10వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. లేని యెడలా సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సీఐటీయూ ఆధ్వర్యంలో..

కార్మికుల సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. హమాలీ కార్మికులతో కలిసి సమ్మె నోటీసును వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో అందజేశారు. ఆయనతో పాటు కార్మికులు భీమప్ప, నర్సింహులు, రాజేష్, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

వైభవంగా బ్రహ్మోత్సవాలు

కుల్కచర్ల: మండల పరిధి పుట్టపహడ్ గ్రామ పంచాయతీ పరిధి కోదండ సీతారామ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. గురువారం గణపతిపూజతో ప్రారంభమైన వేడుకల్లో స్వామివారికి అభిషేకం చేశారు. అనంతరం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామివారిని దర్శించుకున్నారని ఆలయ ధర్మకర్త రమేశాచార్యులు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి చొరవ చూపండి

ఎంపీడీఓ మహేశ్ బాబు

దోమ: గ్రామాల్లో ఎలాంటి సమస్యలు లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ మహేశ్ బాబు అన్నారు. గురువారం మండల పరిధి శివారెడ్డిపల్లి, బొంపల్లి, బాస్‌పల్లితో పాటు తదితర గ్రామాలను ఆయన సందర్శించి, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడారు. పల్లెల్లో ఉన్న సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పారిశుధ్య పనులు, నాలాలు, తాగునీటి ఎద్దడి రాకుండా చూడాలన్నారు. గ్రామస్తులు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం ఎంపీడీఓను బొంపల్లి పంచాయతీ కార్యాలయంలో ఎంపీటీసీ రాములు, పంచాయతీ కార్యదర్శి హలీం, గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యులు చంద్రశేఖర్, అంతిరెడ్డి, భాస్కర్, బషీర్, ప్రభాకర్, గుడిసె రాములు, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.